# జనపదం
J A N A P A D H A M

హైదరాబాద్ | శనివారం 12 అక్టోబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 125

తెలుగు దినపత్రిక

పాఠకులకు, మా శ్రేయోభిలాషులకు

దసరా శుభాకాంక్షలు



జనపదం తెలుగు దిన పత్రిక

## కారు, కమలం లోపాయికారి ఒప్పందం..



- సిసోడియాకు రాని బెయిల్ కవితకు ఎలా వచ్చింది..?
- మూసీ ప్రక్షాళనకు రూ.1.50 లక్ష కోట్లు ఖర్చు చేస్తామని ఎక్కడా చెప్పలేదు
- సురేఖ నాగార్జున కుటుంబాన్ని ఉద్దేశ్యపూర్వకంగా వ్యాఖ్యానించలేదు
- బడా బాబులే లక్ష్యంగా హైడ్రా దూకుడు
- ఈ నెల 15 తర్వాత జిల్లాల పర్యటనలు
- మీడియాతో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చిట్ చాట్

4

## సమగ్ర కులగణనకు అడుగులు..



- రాష్ట్ర ప్రణాళిక శాఖకు బాధ్యతలు
- ఇంటింటి కుటుంబ సర్వే 60 రోజుల్లో పూర్తి చేయాలి
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

4

## రతన్ టాటా అవార్డులు..

### దిగ్గజ పారిశ్రామిక వేత్త పేరున ప్రదానం.. నిర్ణయించిన మహారాష్ట్ర సర్కార్..



మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా స్మార్థకార్థం అవార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. ఆయన గౌరవార్థం పరిశ్రమలో విశేష కృషి చేస్తున్న వారికి ప్రభుత్వం తరపున 'రతన్ టాటా ఉద్యోగ రత్న అవార్డు' ఇవ్వనున్నట్లు పరిశ్రమల శాఖ మంత్రి ఉదయ్ సమంత్ తెలిపారు. అలాగే, ముంబై లోని ఉద్యోగ్ భవన్‌కు రతన్ టాటా ఉద్యోగ్ భవన్ గా పేరు మారుస్తున్నట్లు పేర్కొంది. - జనపదం, ముంబై





## ఇల్లే స్కానింగ్ సెంటర్..

- లింగనిర్ధారణ పరికరాలతో పెద్ద సెటప్పే..
- టెస్టులు చేస్తున్న కేసులో ఐదుగురు అరెస్ట్
- మరో 14 మంది కోసం గాలింపు..
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సింధు శర్మ

4



# వైషమ్యాలు తొలగిస్తాం..

## అందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటు

- బడుగుల పిల్లలూ రాజ్యమేలాలి..
- లోక్ సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పినా కేసీఆర్ కు జ్ఞానోదయం కాలేదు
- విద్య, ఉద్యోగాల కల్పనలో గత ప్రభుత్వ విధానాలు ఆర్ఎస్ గమనించాలి
- పదేళ్లలో విద్యకు కనీసం రూ.10 వేల కోట్లూ ఖర్చు చేయలేదు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు శంకుస్థాపన

జనపదం, హైదరాబాద్ బ్యూరో :

రాష్ట్రంలో కులాలు, మతాల మధ్య నెలకొన్న వైషమ్యాలు తొలగొంచడమే తమ ప్రభుత్వ విధానమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కానీ తమ కుటుంబ సభ్యులే రాజ్యాలు ఏలాలనేది బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విధానం అన్నారు. మీ పిల్లలు మాత్రమే రాజ్యాలు ఏలాలి కానీ... పేదల పిల్లలు బర్రెలు, గొర్రెలు కాసుకోవాలా? అని ప్రశ్నించారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ బలహీన వర్గాలకు అవకాశాలు కల్పించిందని గుర్తు చేశారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని కొందుర్గులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ శంకుస్థాపనకు భూమి పూజా చేసిన సీఎం బీఆర్ఎస్ నేతలపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ అన్న సీఎం పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ప్రతిపక్ష బీఆర్ఎస్ కు గుండు సున్నా ఇచ్చినా జ్ఞానోదయం కాలేదన్నారు. బీఆర్ఎస్ నేతలకు జ్ఞానోదయం కాకపోయినా ఫరవాలేదు కానీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వంటి వివేకవంతుడికి ఏమైందో అర్థం కావడం లేదన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అంటే తనకు గౌరవం ఉందన్న సీఎం ఆయన ఏ రాజకీయ పార్టీలో ఉన్నా తనకేం అభ్యంతరం లేదని చెప్పారు. రూ. కోట్లు వెచ్చించి 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ..(తరువాయి 4లో)

## ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు

- చైర్మన్ గా సర్పంచ్, స్పెషల్ ఆఫీసర్..
- మహిళా సంఘాల నుంచి ఇద్దరు సభ్యులు..
- కన్వీనర్ గా పంచాయతీ సెక్రటరీ
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

4



# పండుగెళ్లే.. పదవి రాకపాయె..

## కత్తులు దూస్తున్న కాంగ్రెస్ సీనియర్లు..

- నేతల చుట్టూ వీసీ అభ్యర్థుల ప్రదక్షిణలు...
- మొన్నటి వరకు ఎలక్షన్ల సాకు...
- ఎటూ తేలని విద్యా కమిషన్, రైతు కమిషన్ మెంబర్లు..
- ఊరిస్తున్న పీఠాలు.. ఉసూరుమంటున్న ఆశావహులు..

ఉన్న పుణ్యకాలం కాస్త గడిచిపోతున్నది. ఎప్పటికవుతుందో., ఎలా జరుగుతుందో గానీ ఒక్క అడుగు ముందుకు కిలోమీటర్ వెనక్కి అన్నట్టుగా నడుస్తున్నది. ఇవ్వాళా.., రేపా.. అంటూ సుమారు ఆరేడు నెలలుగా చూస్తున్న చూపులకు ఊరించుడే తప్ప అప్పగించేది లేదన్నట్టుగానే సాగుతున్నది. నామినేటెడ్, కార్పొరేషన్లు, మరికొన్ని విభాగాలకు బాధ్యులను నియమించాల్సిన రాష్ట్ర సర్కార్ ఇంకా నాన్చుతున్న తీరుతో పార్టీ శ్రేణులు డీలా పడుతున్నాయి. పార్టీ కోసం సర్వస్వం దారపోస్తూ, కేడర్ ను బతికించుకోవడానికి యుద్ధాలు చేసిన తమకు ఇంకెప్పటికీ పదవులు వశమవుతాయో తెలియక ఆశావహులంతా ఆందోళన చెందుతున్నారు. కొందరు నిన్నగాక మొన్నొచ్చిన జూనియర్లు, ప్రసన్న రాయుళ్లు కుర్చీలు దక్కించుకుని చేస్తున్న తీరుపై తీవ్ర అసంతృప్తిగా రగిపోతున్నారు.



జనపదం, బ్యూరో

కాలం గడుస్తూనే ఉంది. పరుగు శరవేగంగా సాగుతూనే ఉంది. పాడు జీవితానికి ఓ పదవి దక్కితే అదే పదివేలు అనుకుని ఆశపెట్టుకున్న సీనియర్లు ప్రస్తుత పరిస్థితితో కుదేలవుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి పదినెలలు కావొస్తున్నా, తమకు జరుగుతున్న అన్యాయాన్ని మాత్రం పెద్దలు పట్టించుకోకపోవడంపై తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. ఉన్నారని గుర్తించినట్టా., పోతే పోని ఉంటే ఉండనీ అని వదిలేసినట్టా.. అని ఆవేదన చెందుతున్నారు. నామినేటెడ్ పదవుల పంపకం, ఇతర పోస్టుల భర్తీకి ఎక్కడా సర్కార్ చొరవ తీసుకుంటున్నట్టు కనిపించడం లేదని వాపోతున్నారు. ఎప్పుడూ ఏదో ఒక సాకుతో తప్పించుకోవడం, లేదంటే కావాలని ఆలస్యం చేయడానికి శతథా ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. పండుగలు వెళ్లిపోతున్నా పదవులు మాత్రం వరించడం లేదని గొడగొడ విలపిస్తున్నారు.

**కత్తులు దూస్తున్న కాంగ్రెస్ సీనియర్లు..**

కాంగ్రెస్ పార్టీ ఓ మహా సముద్రం. నేతలెవరిని కదిపినా అదే విషయాన్ని వల్లెవేస్తూ రాజకీయం చేస్తుంటారు. రాష్ట్ర సర్కార్ అందునా రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అందరినీ కలుపుకుని పోతామని ప్రకటించిన గొప్పతనాన్ని చూసి మురిసిపోయారు. కానీ, నిజానికి అంతర్గతంగా నడుస్తున్న రాజకీయ క్రీనీడను చూసి తట్టుకోలేక ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జూనియర్లు, పార్టీతో అనుబంధం అంతంత మాత్రంగా ఉన్న వారు పదవుల్లో కులుకుతూ తమను మాత్రం పట్టింపు లేకుండా పక్కన పెట్టిన విధానానికి నొచ్చుకుని ఆవేదన చెందుతున్నారు. అధిష్టానం నుంచి ఇగో వచ్చే, అగో వచ్చే అంటూ ఊరిస్తూ, తమన ఊసే లేకుండా కాలాన్ని నెట్టుకొస్తున్నారని వాపోతున్నారు.

**నేతల చుట్టూ వీసీ అభ్యర్థుల ప్రదక్షిణలు...**

అన్ని యూనివర్సిటీలకు వీసీల నియామకం చేస్తామని సర్కార్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఎప్పుడైతే బీఆర్ఎస్ సర్కార్ అర్హులను పట్టించుకోకుండా, రాజకీయాలను ఎంటర్ చేయించి, పైరవీలకు తెరతీశారు. ప్రసన్నం చేసుకుంటే, పతారా ఉన్న నాయకులు తమకు పదవి కట్టబెట్టేందుకు హెల్ప్ చేస్తారని ఏ చిన్న పరిచయాలన్నైనా వదలకుండా వాడేసుకుంటున్నారు. అదే సమయంలో మూటలు గుంజే వారు సైతం ఎంతోకొంత లాగుతూ నాలుగు రాళ్లు వేనకేసుకుంటున్నారు. ఇలా ఎవరి పరిచయాలను వారు పిండుకునే క్రమంలో అసలేం జరుగుతుందో అర్థం కాని ఒత్తిడి. విద్యాసంస్థలకు పెద్దదిక్కుగా ఉండి, పిల్లలకు ఉజ్వల భవిష్యత్ అందజేయాలనే లక్ష్యానికి కేంద్రంగా ఉంచాల్సిన పీఠాలను కూడా రాజకీయం చదరంగంలో వాడకానికి కేరాఫ్ చేయడం అత్యంత దౌర్భాగ్యం. అసలైన అర్హులకు కాకుండా పరపతి ఉపయోగించుకుని షాట్ కట్ డెవలప్ మెంట్ ను ఆశ్రయిస్తున్న వారి కోసం వీసీల పీఠాలు ఉసూరుమని ఎదురు చూస్తున్నాయి.

కాగా పదవుల పంపకం పై పదేపదే ప్రకటనలు, వాయిదాలు., పై నాయకుల అభిప్రాయం ఇది అనే సాకులకు మొన్నటి వరకు హర్యానా, జమ్ము కశ్మీర్ ఎన్నికలు కూడా మరింత బలాన్ని చేకూర్చాయి. ఎట్టకేలకు ఆయా రాష్ట్రాల ఫలితాలు కూడా వెలువడ్డాయి. ఇప్పటికైనా తమ భవితవ్యాలు తేల్చండని వేడుకుంటున్న వారికి ఇంకా పోస్ట్ పోన్లు చేయడంతో ఎప్పటికి తేలునో, మరెప్పటికీ తెగునో అనే ఆశతో కూడిన నిరాశను వెలిబుచ్చుతూ గడుపుతున్నారు. నిత్యం ప్రజలకు, ......(తరువాయి 2లో)



### అంతా సంతోషంగా ఉండాలి..
### రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ దసరా శుభాకాంక్షలు..

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. మనిషి తనలోని చెడు మీద నిత్యపోరాటం చేస్తూ మంచి దిశగా విజయం సాధించాలనే జీవన తాత్వికతను విజయ దశమి మనకు తెలియజేస్తుందన్నారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో దసరాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. వృత్తులకు సంబంధించిన ఉత్పత్తి పరికరాలను, వినియోగించే వాహనాలకు ఆయుధ పూజ చేసి గౌరవించుకునే గొప్ప సంప్రదాయం దసరా ప్రత్యేకత అన్నారు. పాలపిట్టను రాష్ట్ర పక్షిగా, జమ్మి చెట్టు ను రాష్ట్ర వృక్షంగా గుర్తించడంతో పాటు దసరా పండుగ విశిష్టతను చాటే దిశగా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల పాలనలో పలు కార్యక్రమాలు చేపట్టిందని కేసీఆర్ గుర్తుచేశారు. తాము ఎంచుకున్న సమున్నత లక్ష్యాలను చేరుకుని విజయం సాధించేలా ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని దసరా సందర్భంగా కేసీఆర్ ప్రార్థించారు.



### విజయ దశమి శుభాకాంక్షలు..
**- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

విజయ దశమి (దసరా) పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికి అన్నింటా శుభం చేకూరాలని ఆకాంక్షించారు. దసరా పండుగలో సంప్రదాయం, సంస్కృతితో పాటు ఆత్మీయత ఉందని, పర్వదినాన్ని ప్రజలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు. చెడు ఎంత శక్తివంతంగా కనిపిస్తున్నా మంచితనమే విజయం సాధిస్తుంది ఇదే దసరా మనకి గుర్తుచేస్తుందన్నారు. అమ్మవారి అశీస్సులు, ప్రజల దీవెన ఎల్లప్పుడూ ఉండాలని, పండుగ ప్రజలందరికి మరిన్ని విజయాలు అందించాలని కోరుకున్నారు.



## సోమేష్ పై కేసు..

- జీఎస్టీ స్కామ్ పై ఈడీ నజర్..
- కేసీఆర్ ప్రభుత్వ చెల్లింపుల్లో రూ.46 కోట్ల అవకతవకలు
- మాజీ సీఎస్ తీరుపై తీవ్ర ఆరోపణలు..
- ప్రాథమిక విచారణలో ఏడుగురిపై కేసులు..

4

## కూలేముందే మాట్లాడాలి..





- కాంగ్రెస్ హయాంలోనే మూసీ పరివాహకంలో నివాసాలు
- హైదరాబాద్ లోని డ్రైనేజీ వాటర్ మూసీలోనే కలుస్తోంది
- ప్రత్యామ్నాయం లేకుండా సుందరీకరణ ఎలా సాధ్యం..?
- ఆర్టికల్ 370 పునరుద్ధరణ ఆలోచన లేదు
- కశ్మీర్ లో 100 శాతం టార్గెట్ చేరుకున్నాం
- బీఆర్ఎస్ తో కలిసి పనిచేసే అవకాశమే లేదు..
- మీడియా చిట్ చాట్ లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

4




3

## దసరా జోష్..
## మద్యం కిక్ 1000కోట్లు..!

**9 రోజుల్లో రూ.713.25 కోట్లు తాగేశారు..**
**శని,ఆదివారాల్లో పెరగనున్న మద్యం విక్రయాలు**

## మరోసారి తెలంగాణకు గుండు సున్న

### గోదావరి పుష్కరాల కోసం ఏపీకి రూ.100 కోట్లు



- రాష్ట్రానికి రిక్త హస్తం చూపించిన కేంద్రం
- అన్యాయం జరుగుతుంటే బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఏం చేస్తున్నారు
- ఎక్స్ వేదికగా ధ్వజమెత్తిన మాజీ మంత్రి హరీశ్ రావు

**జనపదం, హైదరాబాద్ సిటీ :** నిధుల కేటాయింపులో రాష్ట్రానికి మరోసారి గుండు సున్నానే దక్కిందని బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక నిధుల కింద రూ. 15 వేల కోట్లు మంజూరు కాగా తెలంగాణకు మాత్రం ఒక్క రూపాయి కూడా దక్కలేదన్నారు. అలాగే 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల కోసం కేంద్రం ఏపీకి రాష్ట్రానికి రూ.100 కోట్లు కేటాయించి రాష్ట్రానికి రిక్త హస్తం చూపిందని తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతుంటే ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్రమంత్రులు, బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నిధుల కోసం కేంద్రాన్ని అడిగే ధైర్యం లేనప్పుడు ఎంపీలుగా కొనసాగుతుండడం వృథా అని విమర్శించారు. పార్లమెంట్ లో బీఆర్ఎస్ ఎంపీలు ఉండి ఉంటే ఇంత ......(తరువాయి 4లో)

# అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య

- రూ.657 కోట్లతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన
- విద్యతో పాటు నైపుణ్యాల పెంపునకు ప్రాధాన్యత
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్



**జనపదం, ఖమ్మం:** బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తోందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ వద్ద చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులకు ఎంపీ రామసహాయం రఘు రాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పేద పిల్లలకు సైతం అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య అందించేందుకు రూ. 125 నుంచి 150 కోట్లు ఖర్చు చేసి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామన్నారు. తొలి విడతలో 28 పాఠశాలలకు శంకుస్థాపన చేస్తున్నామని, భవిష్యత్ లో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇటువంటి పాఠశాలల నిర్మాణం జరుగుతుందని చెప్పారు. విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహించేలా విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను ఈ పాఠశాలల్లో కల్పించడం జరుగుతుందన్నారు. 25 ఎకరాల విస్తీర్ణం లో క్రికెట్, ఫుట్ బాల్, బాస్కెట్ బాల్, టెన్నిస్ వంటి క్రీడలు ఆడేందుకు వీలుగా మైదానాలు, కోర్టులు ఏర్పాటు చేస్తామని అన్నారు. సుమారు 2,750 నుంచి 3 వేల మంది విద్యార్థులు ఉండేలా వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఉన్న వసతుల కంటే 100 రెట్లు మెరుగ్గా మన ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థలో ఉంటాయని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధితో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. 657 కోట్లతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ మ్రేనాల్ శ్రేష్ఠ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, ఆర్ అండ్ బీ ఎస్ఈ హేమలత, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె. సత్యనారాయణ, ఆర్డీవో జి. గణేష్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఖమ్మం రూరల్ మండలం తహశీల్దార్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## వైద్యారోగ్య శాఖలో మరో 371 పోస్టుల భర్తీ

**జనపదం, హైదరాబాద్:** తెలంగాణలో వైద్య ఆరోగ్య శాఖలో 371 పోస్టుల భర్తీకి మెడికల్ రిక్రూట్మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. 272 నర్సింగ్ ఆఫీసర్లు, 99 ఫార్మాసిస్ట్ పోస్టులకు ప్రకటన విడుదలైంది. కాగా, గత నెలలో విడుదల చేసిన ఫార్మాసిస్ట్, నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌కు అనుబంధంగా ఈ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు బోర్డు తెలిపింది. గత నెలలో 2,050 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా.. అదనంగా మరో 272 పోస్టులను జత చేసింది. ఈ క్రమంలో మొత్తం భర్తీ చేయనున్న నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు 2,322కు చేరాయి. ఈ నెల 14లోగా నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు అప్లై చేసుకోవాలని.. నవంబర్ 17వ తేదీన ఆన్ లైన్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపింది. అలాగే, గత నెలలో 633 ఫార్మసిస్ట్ పోస్టులకు అదనంగా మరో 99 పోస్టులను కలుపుతూ తాజాగా మరో నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం ఫార్మసిస్ట్ పోస్టుల సంఖ్య 732కు చేరగా.. వీటికి సంబంధించి ఈ నెల 21 వరకూ దరఖాస్తులు స్వీకరించి నవంబర్ 30వ తేదీన పరీక్ష నిర్వహిస్తామని బోర్డు ప్రకటించింది.

# సింగరేణి సంస్థ అభివృద్ధికి ప్రాధాన్యత..

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**జనపదం, రామగుండం:** సింగరేణి సంస్థ ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, స్థితిగతులు తెలియజేయడమే కాకుండా, ఉజ్వల సింగరేణి కోసం రూపొందిస్తున్న భవిష్యత్ ప్రణాళికలపై ఉద్యోగులకు పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తూ, పని తీరు మెరుగు పరచాలన్న ఉద్దేశంతో సింగరేణి యాజమాన్యం అన్ని ఏరియాల్లో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలలో భాగంగా రామగుండం-3 ఏరియాలోని ఓసీ-1, ఓసీ-2, సీహెచ్‌పీ, కమ్యూనిటీ హాలులో ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ప్రగతితో పాటు, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు సాధించిన బొగ్గు, విద్యుత్ ఉత్పత్తి, వ్యయం, లోటుపాట్లు, ఉద్యోగుల పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముందుగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ సందేశాలు వీడియో ద్వారా అందించారు. ఓసీ-2లో నిర్వహించిన సామూహిక విందు భోజనాల కార్యక్రమాలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు, ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడ్డాక గతంలో ఎన్నడూ లేనంతగా 2023-24 ఆర్థిక సంవత్సరం లాభాల వాటా ఉద్యోగులకు పంచడంతో పాటు, కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా 5000 రూపాయల బోనస్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. భవిష్యత్ లో కూడా సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉద్యోగులందరికీ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. విశిష్ట అతిథిగా హాజరైన ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు మాట్లాడుతూ.. గత సంవత్సరం సమష్టి కృషితో నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించినందుకు ఉద్యోగుల దరికీ అభినందనలు తెలియజేశారు. భవిష్యత్ ప్రణాళికలకు అనుగుణంగా ఉద్యోగులు తమ పని తీరును మరింత మెరుగు పరుచుకోకపోతే సంస్థ మనుగడ కష్టమని, ఉద్యోగుల పని సంస్కృతిలో మార్పులు తీసుకురావడానికి ఉద్యోగులతో పాటు కార్మిక సంఘాలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వై.వి.రావు, కోట రవీందర్ రెడ్డి, ఎం.రామచంద్రారెడ్డి, ఎస్వో టు జీఎం జి.రఘుపతి, ఇంచార్జ్ ప్రాజెక్ట్ అధికారి జె.రాజశేఖర్, ఐఈడీ డీజీఎం కె.చంద్రశేఖర్, మేనేజర్ కె.వి.రామారావు, ప్రాజెక్ట్ ఇంజినీర్ నాగరాజు, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఇతర అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.



## డీఎస్పీగా సిరాజ్

### నియామక పత్రం అందజేసిన డీజీపీ జితేందర్

**జనపదం, హైదరాబాద్:** క్రికెటర్ మహ్మద్ సిరాజ్ అధికారికంగా డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అయ్యాడు. శుక్రవారం డీజీపీ జితేందర్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం, పోలీస్ శాఖకు సిరాజ్ ధన్యవాదాలు తెలిపాడు. సిరాజ్‌కు గ్రూప్-1 ప్రభుత్వ ఉద్యోగాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ప్రకటించారు. మహ్మద్ సిరాజ్ బాధ్యతలు స్వీకరించడంతో ముఖ్యమంత్రి హామీ నెరవేరినట్లైంది. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌తోపాటు, టీజీఎంఆర్ఈఐఎస్ అధ్యక్షుడు మహ్మద్ ఖురేషీ పాల్గొన్నారు. సిరాజ్‌కు ఆర్థిక సాయంతోపాటు గ్రూప్-1, డీఎస్పీ పోస్టు కేటాయించాలని గత కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు.

### 600 గజాల స్థలం..

జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 78లో 600 గజాల స్థలాన్ని కూడా కేటాయించారు. ఇదే క్రమంలో డీఎస్పీగా నియామక పత్రం అందజేశారు. అంతర్జాతీయ స్థాయిలో దేశం కోసం క్రికెట్ ఆడుతూ, తెలంగాణ రాష్ట్రానికి గొప్ప పేరు, గౌరవాన్ని తెచ్చాడని కాంగ్రెస్ ప్రభుత్వం సిరాజ్‌కు రావార్డ్, పదవి అందించింది. కొద్ది రోజుల క్రితం బాక్సర్ నిఖత్ జరీన్‌కు కూడా డీఎస్పీగా ఉద్యోగం ఇచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా ఆమె పోలీస్ లాఠీ అందుకుంది.

# వచ్చే ఏడాది నుంచే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ప్రారంభం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- రూ.5 వేల కోట్లతో నిర్మాణాలు పూర్తి చేస్తామని ప్రకటన
- కొందరు చేసే కుట్రలను అడ్డుకుంటామని హెచ్చరిక
- పాత గురుకుల పాఠశాలల కొనసాగింపుపై స్పష్టత




**జనపదం, మధిర:** వచ్చే విద్యా సంవత్సరం నుంచే యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలను ప్రారంభిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మధిర అసెంబ్లీ నియోజకవర్గంలోని లక్ష్మీపురంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలకు శుక్రవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. యుద్ధప్రాతిపదికన 5 వేల కోట్ల రూపాయల వ్యయంతో 28 నుంచి 30 పాఠశాలల నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తి చేస్తామన్నారు. ఈ పాఠశాలల నిర్మాణాన్ని తాము ప్రస్తావించినప్పుడు, కొందరు అపహాస్యం చేశారని, వీటి నిర్మాణానికి డబ్బులు ఎలా సమకూరుస్తారని కూడా ప్రశ్నించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయితే, చిత్తశుద్ధి, సంకల్ప బలం ఉంటే, ఏదైనా సాధించవచ్చనడానికి ఈ యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణమే ప్రబల నిదర్శనమన్నారు. వీటిని అడ్డుకోవడానికి కొందరు శత విధాలా ప్రయత్నిస్తున్నారని, కానీ వారి ఆటలు సాగవన్నారు. ఆపేందుకు ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా, వాటిని అడ్డుకొని వచ్చే విద్యా సమవత్సరం నుంచే ఈ పాఠశాలలను ప్రారంభిస్తామని భట్టి పేర్కొన్నారు. మూడున్నర నెలలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తానూ సుధీర్ఘంగా, లోతుగా ఆలోచించి ఈ పాఠశాలల నిర్మాణానికి రూపకల్పన చేశామన్నారు. తమ స్వీయ అనుభవం నుంచే ఈ పాఠశాలలు పుట్టుకొచ్చాయని చెప్పారు. తాను ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్నపుడు తలెత్తిన పరిస్థితులు, ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, ఈ తరం విద్యార్థులకు అటువంటి అసౌకర్యం కలగకూడదన్న ఉద్దేశంతోనే ఈ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కుల, మత బేధం లేకుండా అందరికీ అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనభ్యసించే అవకాశం ఇక్కడ కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల్ నాగేశ్వరరావు, హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యం, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డీసీసీ అధ్యక్షులు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## దేశమే ఆశ్చర్యపడాలి..

- సిరిపురంలో సోలార్ వెలుగులు
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- సిరిపురం గ్రామస్తులతో మాటా మంతి
- త్వరగా పనులు పూర్తి

**జనపదం, ఖమ్మం:** సోలార్ విద్యుత్ పనులు పూర్తయితే, సిరిపురం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం రాత్రి పైలెట్ ప్రాజెక్ట్ క్రింద ఎంపిక చేసి సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్న మధిర నియోజకవర్గంలోని సిరిపురం గ్రామాన్ని భట్టి సందర్శించారు. ఈ సందర్భంగా సోలార్ విద్యుత్ ఏర్పాటుపై గ్రామస్తులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండా రెడ్డిపల్లి, తన నియోజకవర్గమైన సిరిపురం గ్రామాలను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా గ్రామంలోని వ్యవసాయ పంపుసెట్లకు, ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ అందిస్తామన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే, ఈ గ్రామాలను దేశమే అశ్చర్యంగా చూస్తుందన్నారు. గ్రామస్తులపై భారం పడకుండా ప్రభుత్వమే పెట్టుబడి పెట్టి, గృహావసరాలు పోను, ఉత్పత్తైన మిగులు విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. సోలార్ విద్యుత్ పనులను సాధ్యమైనత తొందరగా పూర్తి చేయాలని, అందుకు గ్రామస్తులందరూ సహకరించాలని భట్టి విజ్ఞప్తి చేశారు.



## నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అమ్మవారి విగ్రహం ధ్వంసం

**జనపదం, క్రైం:** దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. గురువారం అర్ధరాత్రి కరెంట్ కట్ చేసి, సీసీ కెమెరాలు పగులగొట్టి , అమ్మవారి చేతిని విరగ్గొట్టారు. పూజాసామగ్రి అంతా చుట్టూ పడవేసి, అక్కడున్న బారికేడ్లను కూడా తొలగించారు. ఈ ఘటనపై హిందూ సంఘాలు ఆందోళనకు దిగాయి. ఘటనా స్థలానికి బజరంగ్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. ఆర్. లక్ష్మణ రావు , వీహెచ్ పీ కార్యకర్తలు చేరుకుని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బేగంబజార్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఎస్సై, సీఐ, అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకొని నిర్వాహకుల ద్వారా సమాచారం సేకరించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సొసైటీలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. రాత్రి యథాతథంగానే పూజాది కార్యక్రమాలు నిర్వహించుకున్న భక్తులు దాండియా ఆటలు ఆడి అనంతరం రాత్రికి ఇళ్లకు వెళ్లిపోయారు. వేకువజామున 3 నుంచి 5 గంటల మధ్య గుర్తు తెలియని దుండగులు విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు బజరంగ్ దల్‌నాయకులు, కార్యకర్తలు ఆరోపించారు.

# విద్య వ్యవస్థ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఇంటిగ్రెటెడ్ రెసిడెన్సియల్ పాఠశాల నిర్మాణ పనులకు శంకుస్థాపన
- ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జనపదం, భూపాలపల్లి:** అత్యాధునిక వసతులతో ప్రతీ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందుబాటులోకి రానున్నట్లు ఎంపీ కడియం కావ్య తెలిపారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం, మైలారంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల శంకుస్థాపన కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇవ్వని అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపడుతోందన్నారు. మొదటి దశలో 28 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని, అనంతరం అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలో జాతీయ రహదారులు నిర్మాణానికి కేంద్ర జాతీయ రహదారుల అధికారులతో మాట్లాడి నాలుగు వరుసలు రోడ్డు నిర్మాణానికి 660 కోట్లు మంజూరుకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## పండుగెళ్లే.. పదవి రాకపాయె..

**(మొదటి పేజీ తరువాయి)** అందునా కీలకమైన బాధ్యతలు సంబంధీలకు అప్పగిస్తే దాని ఫలితం స్పష్టంగా కనిపిస్తుంది. అలాంటివే విద్యా కమిషన్, రైతు కమిషన్. నిత్యం సామాన్యుడికి అవసరం ఉన్న కనీసాలకు ముడిపడిన ఉన్న ఈ కమిష్లనకు సభ్యుల నియామకం కూడా ఎటూ తేల్చకపోవడం అత్యంత దౌర్భాగ్యం అని పలువురు నిజలను కుండబద్ధలు కొడుతున్నారు. సమయంతో పాటు సాగాల్సిన వాటిని కూడా నిర్లక్ష్యంగా చేసి, ఏమీ పట్టనట్టుగా అన్ని తమకు తెలుసు కదా అని ఆలస్యం చేస్తే ఆయా కమిటీల ఏర్పాటు జాప్యం తప్పకుండా కొన్ని ప్రతికూల పరిస్థితులకు చిరునామాగా మారుతుందనడంలో అతిశయోక్తి లేదు. ఏది ఏమైనా ఢిల్లీ అధిష్ఠానం, రాష్ట్రంలో సీఎం అండ్ ఇతర కీలకమైన వ్యక్తులు పార్టీకి ఎంతో బేస్ లైన్ గా ఉండే పలు కమిషన్లకు చైర్మన్లను, కార్పొరేషన్లకు చైర్మన్లను, యూనివర్సిటీలకు వీసీలను, ఇతరాత్ర పదవుల భర్తీని కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నట్టుగా అనిపిస్తోందని, దానితో పాలనపై తప్పకుండా ప్రతికూల పరిస్థితులు పడుతాయని పలువురు పార్టీ సీనియర్లు బహిరంగంగానే పేర్కొంటున్నారు. ఇంకా ఎన్నాళ్లు ఊరిస్తుంటారో., ఆఖరికైనా శుభప్రదమైన ముగింపు పలికేలా చేస్తారో లేదా ఉసూరుమనిపించి ఎదురు చూడమంటారో అని తీవ్ర మనోవేధనతో నెట్టుకొస్తున్నారు.

## చెన్నై శివారులో రైలు ప్రమాదం

### గూడ్స్‌ను ఢీకొట్టిన ఎక్స్‌ప్రెస్ ట్రైన్

జనపదం, చెన్నై: తమిళనాడులోని చెన్నై శివారులో శుక్రవారం రాత్రి రైలు ప్రమాదం చోటు చేసుకుంది. తిరువళ్లూరు సమీపంలోని కావరిపెట్టై వద్ద ఆగి ఉన్న గూడ్స్ రైలును ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎక్స్‌ప్రెస్ రైలుకు సంబంధించిన రెండు బోగీలు దగ్ధమయ్యాయి. మంటలు చెలరేగడంతో పలువురు ప్రయాణికులు గాయపడినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. గూడ్స్ రైలును ఢీకొట్టిన రైలును మైసూర్-దర్భంగా ఎక్స్‌ప్రెస్ రైలుగా గుర్తించారు. పట్టాలపై నిలబడి ఉన్న గూడ్స్ రైలును అతి వేగంతో వచ్చిన ఎక్స్‌ప్రెస్ రైలు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ప్రమాద ఘటనలో పలు బోగీలు పట్టాలు తప్పాయి. ఘటనాస్థలిలో రైల్వే అధికారులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను సమీప ఆస్పత్రులకు తరలించారు.



# అక్రమ మైనింగ్‌ను వెంటనే ఆపండి

### పౌర హక్కుల నేతలు, న్యాయవాదులు..

### మైలారం సమీప గుట్టపై జరుగుతున్న మైనింగ్ పనుల పరిశీలన

**జనపదం, నాగర్ కర్నూల్ :** నాగర్ కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మైలారం గ్రామ సమీపంలోని గుట్టపై జరుగుతున్న అక్రమ మైనింగ్ పనులను పౌర హక్కుల నేతలు, న్యాయవాదులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరహక్కుల సంఘం నాయకుడు లక్ష్మణ్ మాట్లాడుతూ అక్రమ మైనింగ్ మాఫియా గుట్టను తోడేస్తుంటే పోలీసులు కాపలా కాయడం దారుణంగా ఉందని మండిపడ్డారు. గతంలో ఈ గుట్టపై మైనింగ్ తీయడానికి వచ్చిన అధికారులను గ్రామస్తులు మూకుమ్మడిగా అడ్డుకున్నారని, ఎన్నికల ముందు సైలెంట్ గా ఉన్న మైనింగ్ మాఫియా ఆరు నెలల తర్వాత మళ్లీ మైనింగ్ మొదలు పెట్టారు. అడ్డుకోవడానికి వచ్చిన గ్రామస్తులపై కేసులు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, మైనింగ్ అధికారులకు పోలీసులు కాపలా ఉండి గ్రామానికి కన్న తల్లి గా ఉన్న గుట్టను తోడేసున్నారని వాపోయారు. మైనింగ్ పనులు చేపడితే గ్రామానికి చాలా ప్రమాదం పొంచి ఉందని చెబుతున్నా సంబంధిత అధికారులు స్పందించడ లేదన్నారు. మైనింగ్ పనులను ఆపివేయాలని, లేని పక్షంలో ప్రజా పరిరక్షణ విధంగా అడ్డుకొని నిలిపివేస్తామని హెచ్చరించారు. లేనిపక్షంలో కోర్టు ద్వారా మైనింగ్ పనులను ఆపివేస్తామని గ్రామస్తులకు వారు భరోసా కల్పించారు. ఉద్యమానికి ఉమ్మడి జిల్లా ప్రజా సంఘాల నాయకులు అఖిల పక్షం నాయకులు అందరు సహకరించాలని కోరారు. ప్రజల మనోభావాలు దెబ్బతీసే ఏ విధమైన పనులు చేసిన మేము అడ్డుకొని తీరుతామని లక్ష్మణ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కు సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు



## గ్రామ పంచాయతీ లేఅవుట్ల రిజిస్ట్రేషన్లపై నిషేధం

### రేవంత్ సర్కార్ కీలకం నిర్ణయం

**జనపదం, హైదరాబాద్:** రేవంత్ రెడ్డి సర్కార్ తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే హైదరాబాద్‌లో హైడ్రాను తీసుకొచ్చి అక్రమార్కుల గుండెల్లో బుల్డోజర్లు దింపుతున్న సర్కార్.. ఇప్పుడు హైదరాబాద్ చుట్టుపక్కల అక్రమిత గ్రామ పంచాయతీ లేఅవుట్ల రిజిస్ట్రేషన్లపై నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించింది. అన్ని అక్రమిత గ్రామ పంచాయతీ లేఅవుట్‌లను నిషేధిత జాబితాలోకి చేర్చింది. ఆయా ప్రాంతాల్లోని రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. ఈమేరకు సబ్ రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ చేసింది. ప్రణాళిక లేని వృద్ధిని నిరోధించడమే లక్ష్యంగా ఈ చర్య తీసుకున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. చాలా గ్రామ పంచాయతీ లేఅవుట్లలో రోడ్లు ఇరుకుంగా ఉండటంతో పాటు.. సెట్ బ్యాక్‌లు లేకుండా, డ్రైనేజీలు లేకుండా ఉన్నందున.. ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) అనధికార లేఅవుట్‌ల సర్వే నంబర్‌లను నిషేధిత జాబితా కింద బదిలీ చేయడంతో రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని చాలా మంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పలువురు సామాన్యులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన వస్తోంది.

## ద్రోణి ప్రభావంతో వర్షాలు

**జనపదం, బ్యూరో:** తెలంగాణవ్యాప్తంగా పలుచోట్ల మోస్తరు వర్షాపాతం నమోదైంది. రాగల రెండురోజులు సైతం వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో వానలు పడుతాయని హెచ్చరించింది. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు పడుతాయని చెప్పింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. ద్రోణి ప్రభావంతో వర్షాలు కొనసాగుతాయని.. ఈ నెలలో అరేబియా సముద్రంలో ఒకటి, బంగాళాఖాతంలో రెండు తుఫాన్లు ఏర్పడే అవకాశాలున్నాయని భారత వాతావరణ కేంద్రం అంచనా వేసింది.



## ఏపీ బీజేపీకి ఇద్దరు నేతలు రాజీనామా..

**జనపదం, ఆంధ్రప్రదేశ్ :** సామాజిక మాధ్యమాల్లో నగ్న వీడియోలు, సంభాషణలు వెలుగుచూసిన నేపథ్యంలో ఏపీ గుంటూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనమా నరేంద్ర, మీడియా ప్యానలిస్టు కమిటీ సభ్యుడు పాటిబండ్ల రామకృష్ణపై ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. వారిద్దరితో రాజీనామాలు చేయించింది. ఈ వ్యవహారంపై ముగ్గురు సభ్యులతో కోర్ కమిటీని గురువారం గుంటూరుకు పంపింది. ఆ ఇద్దరు నాయకులు వారికి వివరణ ఇచ్చారు. సామాజిక మాధ్యమాల్లో ఉన్న వీడియోలు నకిలీవని, తమవి కావని చెప్పడంతో అలా అయితే అది ఎవరి పనో తేల్చడానికి పార్టీ తరఫున పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోర్ కమిటీ నిర్ణయించింది.



## దుర్గామాత సేవలో సబితా ఇంద్రారెడ్డి

### ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే

**జనపదం, రంగారెడ్డి** : మహేశ్వరం నియోజకవర్గ పరిధి ఆర్కేపురం డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీలో నెలకొల్పిన దుర్గామాతను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, కుమారుడు పట్లోళ్ల కౌశిక్ రెడ్డితో కలిసి దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు దుర్గామాత అవతారంలో యావత్ ప్రపంచానికి దర్శనమిస్తున్నదని, ఈ సందర్భంలో అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, నాగేష్, లింగం గౌడ్, మహిళా నాయకురాలు శైలజ రెడ్డి, పటేల్ సునీత రెడ్డి, పుష్పలత, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.



## తహసీల్దార్ల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

**జనపదం, హైదరాబాద్** : రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ల ఎన్నికల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లు సొంత జిల్లాలకు తిరిగిపోయేలా అవకాశం కల్పిచాలని తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ మొదటి నుంచి చేస్తున్న కృషి ఫలించింది. ఇప్పటికే ఇదే విషయమై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ ని పలు మార్లు టీజీటీఏ నేతలు కలిసి ఎన్నికల బదిలీలపై వినతిపత్రాలను అందజేశారు. ఇటీవల రెవెన్యూ మంత్రితో జరిగిన ముఖాముఖీ సమయంలోనూ ఇదే విషయాన్ని టీజీటీఏ బలంగా చెప్పింది. ఎట్టకేలకు బదిలీలకు సంబంధించిన ఐచ్ఛికాలను ఇచ్చుకోవాల్సిందిగా తహసీల్దార్లకు అవకాశం ఇస్తూ సీసీఎల్ఏ ఆదేశాలను జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల<టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, మహిళా అధ్యక్షురాలు పి.రాధ, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, సెక్రటరీ జనరల్ పూల్ సింగ్ చౌహాన్ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ కి ధన్యవాదాలు తెలిపారు.



## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

**జనపదం, హైదరాబాద్** : దేవాలయాల్లో దొంగతనాలు చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. మెదక్ జిల్లాలోని నాగిరెడ్డి పేట్, హవేలీ ఘనపూర్, చిన్న శంకరంపేట్, చేగుంటలోని ఆలయాల్లో గత నెలలో నాలుగు దొంగతనాలు జరిగాయని చెప్పారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు వేగవంతం చేశామని, చిన్న శంకరంపేట (మం) గవ్వలపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కొందరు అనుమాన స్పదంగా టాటామంజా కారులో తప్పించుకొనే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. వారిని చాకచక్యంగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. పట్టుబడిన ముఠాలో మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన అస్లాం, షేక్ ఇలియాస్, షేక్ సమీర్‌గా గుర్తించమని ఆ ముగ్గురు పాత నేరస్థులే అని ఎస్పీ తెలిపారు. అంతరాష్ట్ర ముఠా నుంచి మూడు సెల్ ఫోన్‌లు, ఒక కారు, ఐదు లక్షల 50 వేల రూపాయల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నమని ఎస్పీ వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. దొంగల ముఠాను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందనందించారు.

## వచ్చే నెల 17, 18 తేదీల్లోనే గ్రూప్ -3 పరీక్షలు..

- పరీక్షకు వారం రోజులు ముందుగానే హాల్ టికెట్లు విడుదల
- వెబ్ సైట్ లో మోడల్ ఆన్సర్ బుక్ లెట్లు
- ప్రకటించిన టీజీపీఎస్సీ

**జనపదం, ఎడ్యుకేషన్** : గతంలో ప్రకటించిన విధంగా నవంబర్ 17, 18 తేదీల్లోనే గ్రూప్ –3 పరీక్షలను నిర్వహిస్తామని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. పరీక్షకు వారం రోజుల ముందుగానే హాల్ టికెట్లను విడుదల చేస్తామని వెల్లడించింది. ఈ మేరకు మోడల్ ఆన్సర్ బుక్ లెట్లను వెబ్ సైట్ లో ఉంచినట్లు తెలిపింది. మొత్తం 1388 గ్రూప్ –3 పోస్టులను భర్తీ చేయనున్నారు. అందుకోసం 5,36,477 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గ్రూప్–3 ఉద్యోగ ప్రకటనలో భాగంగా మొదటగా 2022 డిసెంబర్ 30న 1363 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేసింది. అనంతరం మరో 13 పోస్టులు చేర్చారు. బీసీ గురుకుల సొసైటీలో ఖాళీగా ఉన్న 12 పోస్టులను అదనంగా చేర్చడంతో మొత్తం పోస్టుల సంఖ్య 1375కి పెరిగింది. ఆ తర్వాత నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ కార్యాలయంలో 13 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించింది. ఈ క్రమంలో.. మరోసారి 13 పోస్టులు కలపింది. దీంతో.. మొత్తం గ్రూప్ –3 ఉద్యోగాల సంఖ్య 1388కి పెరిగాయి.

# ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో తెలంగాణ బడులు..

- .ప్రపంచ మేటి విద్యార్థులను తయారు చేసేలా యంగ్ ఇండియా విద్యా సంస్థల ఏర్పాటు
- ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు
- 4 నుంచి 12వ తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య
- క్రీడలను ప్రోత్సహించేలా అవసరమైన సదుపాయాల కల్పన
- డిజిటల్ స్మార్ట్ బోర్డు, కంప్యూటర్ ల్యాబ్ వంటి అత్యాధునిక సౌకర్యాల కల్పన
- వచ్చే దసరా నాటికి నిర్మాణాలు పూర్తి
- అడవి సోమనపల్లి లో విద్యా సంస్థల నిర్మాణానికి శంకుస్థాపన



**జనపదం, పెద్దపల్లి** : మంథని మండలం అడవి సోమనపల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్ బాబు, ప్రపంచ మేటి విద్యార్థులను తయారు చేసేలా యంగ్ ఇండియా విద్యా సంస్థల ఏర్పాటు చేయడం జరుగుతుందని రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం మంత్రి శ్రీధర్ బాబు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి మంథని మండలంలో అడవి సోమనపల్లి గ్రామంలో 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మార్పు తీసుకువస్తామని ప్రజలకు ఇచ్చిన హామీలను క్రమక్రమంగా అమలు చేస్తున్నామని అన్నారు. గ్యారెంటీ పథకాలలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 సబ్సిడీ సిలిండర్, ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కార్యక్రమం వచ్చే నెల నుంచి ప్రారంభిస్తామని అన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా, బడుగు బలహీన వర్గాల పిల్లలకు మంచి నాణ్యమైన విద్య అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, క్యాబినెట్ సహచరులు ఎన్నికల సమయంలో చెప్పిన మాట ప్రకారం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని అన్నారు. యంగ్ ఇండియా సమీకృత విద్యా సంస్థల క్రింద ప్రభుత్వం మొదటి విడతలో 28 పాఠశాలలను మంజూరు చేసిందని, మానేరు నది ఒడ్డున ఉన్న అడవి సోమనపల్లి గ్రామంలో యంగ్ ఇండియా సమీకృత విద్యా సంస్థ రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించిన డీఎస్సీ నియామకం అంశాన్ని రికార్డు సమయంలో ప్రజా ప్రభుత్వం పూర్తి చేసి, ఇటీవల ముఖ్యమంత్రి చేతుల మీదుగా 11 వేలకు పైగా నూతన టీచర్లను నియమించడం జరిగిందని, ఇదే గ్రామానికి చెందిన శ్రవణ్ కుమార్ అనే యువకుడికి ఎస్.జి.టి ఉద్యోగం లభించిందని అన్నారు. గడిచిన 10 ఏళ్ళలో పెండింగ్ ఉన్న టీచర్ల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేశామని, విద్యాశాఖ మెరుగుపరిచేందుకు కమిషన్ ఏర్పాటు చేశామని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో , అన్ని వసతులతో కుల, మత భేదాలు లేకుండా మన విద్యార్థులకు విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థను మంజూరు చేస్తుందని, 25 ఎకరాల విస్తీర్ణంలో ఎస్సి, ఎస్టీ ,బీసి, మైనారిటీ వంటి అన్ని రంగాల విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదివేలా ఈ విద్యా సంస్థ ఉంటుందని అన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థలో 4వ తరగతి నుంచి 12వ తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యా బోధన అందుతుందని, విద్యార్థుల సౌకర్యం కొరకు తరగతి గదులలో డిజిటల్ స్మార్ట్ బోర్డ్, కంప్యూటర్ ల్యాబ్ , 5 వేలకు పైగా పుస్తకాలతో కూడుకున్న గ్రంథాలయం మొదలగు అత్యాధునిక సౌకర్యాలతో 25 ఎకరాల విస్తీర్ణంలో విద్యాసంస్థ నిర్మాణం ఉంటుందని అన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు యంగ్ ఇం డియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల్లో క్రికెట్ , ఫుట్ బాల్ ,బాస్కెట్ బాల్, టెన్నిస్ మొదలగు క్రీడలు ఆడేందుకు అవసరమైన గ్రౌండ్, ఇతర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. వచ్చే సంవత్సరం దసరా నాటికి ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థల నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని వస్తామని, అన్ని వర్గాల విద్యార్థులు ఒకేచోట అంతర్జాతీయ స్థాయి విద్య అందుకునే అవకాశం కల్పిస్తామని అన్నారు. ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థలలో ,2500 పైగా విద్యార్థుల చదువుకుంటారని, వీరికి 120 మంది టీచర్లను కేటాయించడం జరుగుతుందని అన్నారు. గ్రీన్ ఎనర్జీ ద్వారా సొంతంగా విద్యుత్తు ఉత్పత్తి చేసుకునేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. 250 నుంచి 300 కోట్లు ఖర్చు చేసి ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల నిర్మాణం చేస్తున్నామని అన్నారు. త్వరలో రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాల్లో కూడా ఇటువంటి ఇంటిగ్రేటెడ్ స్కూల్ లోను మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. అనంతరం మంత్రి గౌడ కులస్తులకు కాటమయ్య రక్షక కవచ కిట్లను పంపిణీ చేశారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించి ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థలను నిర్మిస్తుందని, సద్వినియోగంచేసకోవాలన్నారు.హైదరాబాద్ లో కాక వెంకట స్వామి విద్యా సంస్థను ఏర్పాటు చేసి సంవత్సరానికి 5 వేల మందిని తక్కువ ధర విద్య అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పిల్లలకు అవసరమైన వసతులతో కూడిన రెసిడెన్షియల్ విద్యా సంస్థ ఆశించిన స్థాయిలో లేవని గమనించి ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అడవి సోమనపల్లి గ్రామంలో ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థ మంజూరు కావడం జరిగిందని అన్నారు. 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థ నిర్మిస్తున్నామని, భవిష్యత్తు అవసరాల కోసం మరో 5 ఎకరాలు విస్తరించే అవకాశం సైతం ఇక్కడ ఉందని, గ్రామ ప్రజలకు ఇబ్బంది కాకుండా ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థ కోసం 900 మీటర్ల ప్రత్యేక 4 లైన్ రోడ్డు వేసేందుకు ప్రతిపాదనలు రూపొందించామని అన్నారు. నాణ్యతతో కూడిన భవన నిర్మాణ వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకొని వస్తామని అన్నారు. కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్ పర్సన్ రమ, ఆర్ అండ్ బీ ఈఈ భావ్ సింగ్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్, ఎక్సైజ్ సూపరిటెండెంట్ మహిపాల్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో అంతర్జాతీయ స్థాయి విద్య


- ప్రపంచ మేటి విద్యార్థులను తయారు చేసేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్స్
- మంత్రి పొన్నం ప్రభాకర్
- హుస్నాబాద్ లో శంకుస్థాపన చేసిన మంత్రి



**జనపదం, సిద్దిపేట (హుస్నాబాద్)** : అంతర్జాతీయ స్థాయి విద్యకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ నియోజకవర్గ పరిధి కోహెడ మండలం తంగలపల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల కాంప్లెక్స్ కు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నమూనాలను వీడియో రూపంలో చూపించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ హుస్నాబాద్ కి అంతర్జాతీయ స్థాయిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ రావడం విద్యా రంగంలో ఈ ప్రాంత మరింత ముందుకు పోతుందన్నారు. విద్యార్థి నాయకుడిగా మీ అందరి ఆశీర్వా దంతో ఎమ్మెల్యే, మంత్రి అయ్యానని. విద్య,వైద్యం, టూరిజం, పరిశ్రమలు, వ్యవసాయం, ఉపాధి కల్పన అన్నింటిపై దృష్టి సారించామన్నారు. జీవో 190 ద్వారా నాలుగు గురుకులాలు ఒకే కాంప్లెక్స్ గా విద్యను అంతర్జాతీయ స్థాయిలో తీసుకుపోవడానికి ఏర్పాటు చేశామని తెలిపారు. నాలుగో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఇక్కడే చదువుకునేలా భవనాల నిర్మాణం జరుగుతుందన్నారు. రాష్ట్రం లో 25 వేల పాఠశాలలకు 1100 కోట్లతో మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఉపాధ్యాయులకు 19 వేల ప్రమోషన్ లు,35 వేల బదిలీలు చేశామని డీఎస్సీ ద్వారా 10 వేల మందికి నియామక పత్రాలు అందించామన్నారు. ముఖ్యమంత్రి ,ఉప ముఖ్యమంత్రి ఆలోచన ఈ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ లు ఏర్పాటు అవుతున్నాయన్నారు. వచ్చే విద్యా సంవత్సరం లోపు పాఠశాల భవనం నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. ఇన్నోవేషన్ పార్క్ త్వరలోనే భూమి పూజ కార్యక్రమం ఉంటుందన్నారు. బస్వపూర్ లో కృషి విజ్ఞాన కేంద్రానికి స్థల పరిశీలన చేశామని, త్వరలోనే భూమి పూజ కార్యక్రమం చేసుకుంటామన్నారు. సర్వాయి పేట లో టూరిజం హబ్, ఎల్లమ్మ చెరువు అభివృద్ధికి రూ.37 కోట్లు, అక్కన్నపేట్ లో పరిశ్రమల హబ్ ఏర్పాటు, ఎల్కతుర్తి లో 100 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో, ఎమ్మార్వో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## దసరా జోష్..

- మద్యం కిక్కు 1000కోట్లు..!
- 9 రోజుల్లో రూ.713.25 కోట్లు తాగేశారు..
- శని,ఆదివారాల్లో పెరగనున్న మద్యం విక్రయాలు



**జనపదం, బ్యూరో** : రాష్ట్రంలో దసరా కిక్కు ఆకాశాన్ని తాకుతోంది. భారీగా మద్య విక్రయాలు కొనసాగుతున్నాయి. దీంతో ఎక్సైజ్ శాఖ ఖజాన గలగలలాడుతోంది. కేవలం తొమ్మిది రోజుల వ్యవధిలోనే రూ. 713.25 కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయంటే మందుబాబుల జోరు ఏ స్థాయిలో ఉందో ఊహించవచ్చో గెస్ చేయవచ్చు. దసరా పండుగా ముగిసే నాటికి రాష్ట్రంలో మద్యం అమ్మకాలు సుమారు వెయ్యి కోట్లకు చేరే అవకాశం కనిపిస్తోంది. దసరా అంటేనే తెలంగాణలో ప్రతి ఇంట్లో దాదాపు మటన్ బొక్కలు, మద్యం ఉండాల్సిందే. మందు, ముక్క లేనిదే ముద్ద దిగదు. ఇది అనాదిగా వస్తున్న సంప్రదాయం కూడానూ. దీని కారణంగానే ప్రతియేటా దసరా పండుగ సమయంలో మద్య వి క్రయాలు అధికంగా జరుగుతుంటాయి. కానీ ఈ సంవత్సరం మరింత అధికంగా విక్రయాలు జరుగుతుండడం విశేషం. ప్రస్తుతం రాష్ట్రంలో తెలంగాణలో 2,216 వైన్స్లు, వెయ్యికి పైగా బార్లు న్నాయి. ఈ నేపత్యంలో శరన్నవరాత్రుల సందర్భంగా వరుస సెలవులు కావడంతో మందుపార్టీలపై ఫుల్ ఫోకస్ పెట్టినట్లున్నారేమో ఏమో తెలియదు కానీ ఏకంగా 9 రోజుల్లో రూ.713.25 కోట్ల మద్యాన్ని తాగేశారు. ఈ విషయాన్ని అధికార యంత్రాంగమే వెల్లడించింది. కాగా దేశవ్యాప్తంగా మద్యం వినియోగంలో రాష్ట్రాల వారిగా సర్వే చేస్తే రెండు తెలుగు రాష్ట్రాల్లో మద్యం విక్రయాలు రికార్డు స్థాయిలో ఉండడం విశేషం. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (నిపెప్) ఇటీవలే ఓ అధ్యయనం విడుదల చేసింది. ఇందులో భాగంగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మద్యం వినియోగంపై కీలక విషయాలు తెరపైకి తెచ్చింది. దీని ప్రకారం మద్యంపై తెలంగాణ వార్షిక సగటు తలసరి వినియోగ వ్యయం రూ.1,623 గా వెల్లడించింది. అలాగే ఆంధ్రప్రదేశ్లో మద్యంపై వార్షిక సగటు తలసరి వినియోగ వ్యయం రూ.1,306గా ఉంది అని వెల్లడించింది తెలుగు రాష్ట్రాల తర్వాత చత్తీస్ ఘడ్, పంజాబ్, ఒడిశా, కేరళ, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్లు ఉన్నాయి.



## టాటా ట్రస్ట్ బోర్డ్ చైర్మన్‌గా నోయెల్ టాటా ఏకగ్రీవంగా ఎన్నిక

**జనపదం, బిజినెస్** : టాటా ట్రస్ట్ బోర్డ్ చైర్మన్‌గా నోయెల్ టాటా ఎన్నికయ్యారు. నోయెల్ టాటాను ట్రస్ట్ బోర్డ్ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా, టాటా స్టీల్, టైటాన్ కంపెనీ వైస్ చైర్మన్‌గా ఆయన ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. అయితే టాటా సన్స్ గ్రూప్ సంస్థల చైర్మన్ రతన్ టాటా బుధవారం రాత్రి మరణించారు. దీంతో ఆయన వారసుడిగా నోయెల్ టాటాను ట్రస్ట్ బోర్డ్ ఎన్నుకుంది. ఐదు ఖండాల్లో దాదాపు 100 దేశాల్లో ఈ సంస్థకు కంపెనీలున్నాయి. ప్రతి ఏటా భారీ ఆదాయం వస్తుంది. అందులో 66 శాతం టాటా ట్రస్ట్‌కు వెళ్లిపోతుంది. ఈ మొత్తం సేవా కార్యక్రమాలకు విరాళాల రూపంలో వెళ్లిపోతుంది. ఈ నేపథ్యంలో నోయెల్ టాటాను ట్రస్ట్ బోర్డ్ ఎన్నుకుంది. అదీకాక ట్రస్ట్ బోర్డ్ సమావేశాల్లో కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నోయెల్‌ను టాటా ట్రస్ట్‌కు చైర్మన్‌గా ఎన్నుకుంది. మరోవైపు టాటా గ్రూప్ చైర్మన్‌గా ఆ సంస్థ వ్యాపారాన్ని 4 బిలియన్ల డాలర్ల నుంచి 100 బిలియన్ల డాలర్లకు రతన్ టాటా తీసుకు వెళ్లిన సంగతి తెలిసిందే. అయితే రతన్ టాటా వివాహం చేసుకోలేదు. దాంతో ఆయన వారసుడు ఎవరనే ఓ చర్చ సైతం సాగింది. అలాంటి వేళ రతన్ టాటా సవతి సోదరుడు నోయెల్ పేరు వినిపించింది. ఆయనకు ముగ్గురు పిల్లలు మాయా టాటా, నెవిల్లే టాటా, లేహ్ టాటాలు ఉన్నారు. వారు సైతం టాటా సంస్థలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టాటా సంస్థలో దాదాపు 10 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు.



## శబరిమల ఆన్‌లైన్ క్యూ బుకింగ్

### సర్కార్ నిర్ణయానికే దేవస్థానం బోర్డు ఓకే

**జనపదం, బ్యూరో:** మకరవిళక్కు సీజన్‌లో వర్చువల్ క్యూ బుకింగ్ పద్ధతి ద్వారా మాత్రమే శబరిమల అయ్యప్ప దర్శనానికి అనుమతించాలన్న కేరళ ప్రభుత్వ నిర్ణయాన్ని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) సమర్థించింది. యాత్రికులతోపాటు పుణ్యక్షేత్రాల భద్రతను నిర్ధారించడానికి ఈ వ్యవస్థ అవసరమని శుక్రవారం పేర్కొంది. ఒక మంచి ఉద్దేశంతోనే నిర్ణయం తీసుకున్నామని టీడీబీ ప్రెసిడెంట్ పీఎస్ ప్రశాంత్ తెలిపారు. శబరిమలకు వచ్చే భక్తులను వెనక్కి పంపబోమని, దర్శనం చేసుకోకుండా ఎవరూ తిరిగి వెళ్లాల్సిన అవసరం లేదని ప్రశాంత్ చెప్పారు. వర్చువల్ క్యూ బుకింగ్ అనేది శబరిమలను సందర్శించే ప్రతి భక్తుడి అధికారిక రికార్డుని, స్పాట్ బుకింగ్ అనేది కేవలం ప్రవేశ అనుమతి పత్రమని తెలిపారు. 2022–23 సీజన్‌లో స్పాట్ బుకింగ్‌ల సంఖ్య 3,95,634 కాగా, ఆ తర్వాతి సీజన్‌లో అది 4,85,063కి పెరిగిందని ఆయన చెప్పారు. సాధారణంగా వర్చువల్ క్యూ సిస్టమ్ ఉన్నప్పుడు స్పాట్ బుకింగ్ తగ్గాలని, కానీ ఇక్కడ పెరిగిందని తెలిపారు. అది మంచి పరిణామం కాదని అభిప్రాయపడ్డారు. యాత్రికుల సంఖ్య పెరిగితే టీడీబీకే మంచిదని ప్రశాంత్ అన్నారు. హుండీ సేకరణ, ప్రసాదాల విక్రయాల ద్వారా ఆదాయం పెరుగుతుందని చెప్పారు. కానీ అన్నింటి కన్నా యాత్రికుల భద్రత తమకు ముఖ్యమని చెప్పారు. భక్తులు, దేవాలయం రెండింటి భద్రతకే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. శబరిమల ఏ ఇతర ఆలయాల మాదిరి కాదని అన్నారు. కొండపై భక్తుల రద్దీ అత్యంత ప్రాధాన్యమైన అంశమని చెప్పారు.

### భక్తుల రద్దీ నేపథ్యంలో..

గతేడాది డిసెంబరులో మండల పూజల సమయంలో శబరిమలకు భక్తులు పోటెత్తారు. ఈ క్రమంలో భక్తుల రద్దీని నియంత్రించడంలో దేవస్థానం బోర్డు విఫలమైంది. భక్తులకు కనీస వసతులు కల్పించలేక ఇబ్బందులు పడింది. కొందరు భక్తులు అయ్యప్ప దర్శనం చేసుకోకుండానే తిరిగి పయనమయ్యారు. అప్పట్లో దేవస్థానం బోర్డుపై విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది శబరిమల అయ్యప్ప దర్శనం కోసం ఆన్‌లైన్ బుకింగ్ ద్వారానే యాత్రికులకు అనుమతి ఇవ్వనున్నట్లు ఇటీవల కేరళ ప్రభుత్వం తెలిపింది. రోజుకు గరిష్ఠంగా 80 వేల మందిని మాత్రమే దర్శనానికి అనుమతిస్తామని చెప్పింది.

### దర్శన వేళల పొడిగింపు

మకరవిళక్కు సీజన్‌లో రద్దీని మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి ఆలయ దర్శన వేళలను పొడిగించారు. భక్తులు ఉదయం 3 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శనం చేసుకోవచ్చని తెలిపారు. రోజుకు 17 గంటలపాటు దర్శనానికి అనుమతిస్తామని వెల్లడించారు.

## బ్లూ క్రాస్ సొసైటీకి కేటాయిస్తే ఉద్యమిస్తాం..

- కార్మికుల అడ్డా స్థలాన్ని ముందు ఇక్కడి కార్మికులకు కేటాయించాలి
- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్.

**జనపదం హైదరాబాద్** : హెచ్ ఎం టీ స్థలం లో చాలా సంవత్సరాలు గా లేబర్ అడ్డా ను ఏర్పాటు చేసుకొని భవన నిర్మాణ కార్మికులు పనిచేస్తున్నారని, దానిని అమల బ్లూ క్రాస్ సొసైటీకి కేటాయిస్తే ఉద్యమిస్తాము సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జగద్గిరిగుట్ట అడ్డా వద్ద భవన నిర్మాణ కార్మికులు ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఏసురత్నం, నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ పాల్గొని మాట్లాడారు. జగద్గిరిగుట్ట భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గత 40 సంవత్సరాలుగా చివరి బస్టాప్ వద్ద అడ్డా ఏర్పాటు చేసుకొని పని చేస్తున్నాయినని, అయి తే జనాభా పెరగడం, వాహనాల రద్దీ పెరగడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు, ఆక్సిడెంట్ జరిగి మరణాలు కూడా సంభవించి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయన్నారు. అలాంటి వాటిని దృష్టిలో పెట్టుకొని 2 సంవత్సరాలు క్రితం హెచ్ఎంటీ ఖాళీ స్థలంలో అడ్డగా ఏర్పర్చుకొని పని చేస్తున్నారని అన్నారు. ఈ విషయాన్ని లేబర్ ఆఫీస్ లో,అదే విధంగా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాలు ఇవ్వగా 2 నెలల క్రితం గాజుల రామారం ఆర్ ఐ వచ్చి సర్వే జరిపి పరిశీలించడం కూడా జరిగిందన్నారు. కానీ నేడు ఆకస్మతుగా ఈ స్థలాన్ని అమల బ్లూ క్రాస్ సొసైటీకి కేటాయించమని, అడ్డా నాయకులను కానీ, ఎవ్వరికి చెప్పకుండా ఇక్కడ ఉన్న జాతీయ జండాను,కార్మిక జండాను తొలగించి స్థలాన్ని చదును చెయ్యడం దారుణమని, భవన నిర్మాణ కార్మికులకు స్థలం కేటాయించి తరువాత ఇతరులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థలం కేటాయించకుండా అధికారులు నిరంకుశంగా వ్యవహరిస్తే తీవ్ర ఆందోళన తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, అధ్యక్షుడు హరినాథ్,సిపిఐ సహాయ కార్యదర్శి దుర్గయ్య,ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు బాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష,కార్యదర్శులు రవి,రాము, నాయకులు సామెల్,యాదగిరి, సోమ య్య, వెంకన్న,చంద్రయ్య,సైదులు,కరుణాకర్, అంజి,మధు తదితరులు పాల్గొన్నారు.




## ఎమ్మెల్సీ ఎన్నికలకు భారీ డిమాండ్

### పోటీ చేసేందుకు పలువురి ఆసక్తి

**జనదపం, హైదరాబాద్** : ఉత్తర తెలంగాణలో మరో రాజకీయ రణానికి రంగం సిద్ధమవుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ 2019 మార్చిలో జరిగిన ఎన్నికల్లో 17 మంది పోటీచేశారు. కాంగ్రెస్ కు చెందిన టి.జీవన్ రెడ్డి 39.430 ఓట్ల అధిక్యంతో అప్పటి టీఆర్ఎస్ మద్దతు ప్రకటించిన చంద్రశేఖర్ గౌడ్ పై విజయం సాధించారు. టి.జీవన్ రెడ్డి పదవీకాలం 2025 మార్చి 29 తో ముగియనుంది. దీంతో ఎన్నికలను నిర్వహించాలని ఎన్నికల సంఘం భావిస్తుంది. ఈ నేపథ్యంలోనే ఈ సెప్టెంబర్ 30 నుండి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పరిధిలోని పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుంది. పట్టభద్రులు ఎన్నుకునే ఎమ్మెల్సీ పదవి కోసం పోటీలో నిలవాలని రాష్ట్రంలోని అన్ని పార్టీల నుండి అభ్యర్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పార్టీలనుండే కాకుండా మరి కొంతమంది విద్యావేత్తలు, సామాజిక వేత్తలు కూడా పోటీలో నిలిచే అవకాశం కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ నుండి ప్రస్తుత ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి మళ్ళీ బరిలో నిలుస్తాడా లేదా అనేది త్వరలో తేలనుంది. కాంగ్రెస్ పార్టీ నుండి వెలిచాల రాజేందర్ రావు, రోహిత్ రావు, బీజేపీ నుండి పోల్సాని సుగుణకర్ రావు, రాణి రుద్రమ దేవి తో పాటు పలువురు పోటీలో నిలిచేలా ప్రణాళికలను సిద్ధం చెసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక బీఆర్ఎస్ నుండి కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్, శేఖర్ రావు తో పాటు ఓయూ జేఏసి నేత ఒకరు బరిలో నిలిచేలా తనవంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. పార్టీలనుండే కాకుండా విద్యావేత్తలుగా పేరొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధిపతి నరేందర్ రెడ్డి తో పాటు మరికొందరు బరిలో నిలిచేలా అంతర్గత ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే నరేందర్ రెడ్డి, ప్రసన్న హరికృష్ణ లు నాలుగు ఉమ్మడి జిల్లాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తూ పట్టభద్రులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు.

# ఇల్లే స్కానింగ్ సెంటర్..

- లింగనిర్ధారణ పరికరాలతో పెద్ద సెటప్పే..
- అమాయకపు మహిళలే లక్ష్యంగా పరీక్షలు..
- టెస్టులు చేస్తున్న కేసులో ఐదుగురు అరెస్ట్
- మరో 14 మంది కోసం గాలింపు..
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సింధు శర్మ




**జనపదం, కామారెడ్డి క్రైం :** తన ఇంట్లోనే స్కానింగ్ సెంటర్ సెట్ చేసి లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న రాజంపేట మండల కేంద్రానికి చెందిన బల్ల రవీందర్ తోపాటు ముఠాలోని నలుగురిని అరెస్ట్ చేసినట్లు కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వెల్లడించారు. రాజంపేటకు చెందిన రవీందర్ ఇంట్లోనే లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాడనే సమాచారం మేరకు సీసీఎస్ పోలీసులు దాడి చేశారు. ఆ సమయంలో సిద్దిపేట జిల్లా వర్గల్ కు చెందిన మహిళలకు లింగనిర్ధారణ చేస్తూ రవీందర్ పట్టుబడ్డాడు. రవీందర్ గతంలో రాజంపేటలోని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి స్కానింగ్ విభాగంలో పని చేశాడు. 2021లో తాను పని చేసిన కౌసల్య ఆస్పత్రి సీజ్ కావడంతో అక్రమమార్గంలో అలవాటు పడిన రవీందర్ తాను అల్ట్రాసౌండ్ స్కానర్ ను కొనుగోలు చేసి ఇంట్లో ఏర్పాటు చేశాడు. ఈ కేసులో రవీందర్ ఏ1 కాగా, అతడికి అల్ట్రాసౌండ్ స్కానర్ ను అమ్మిన విజయవాడకు చెందిన పాటాల సాంసన్ ఏ-2, కృష్ణ జిల్లాకు చెందిన చింతలపూడి దుర్గాప్రసాద్ ఏ-3గా కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. గర్భిణులను లింగ నిర్ధారణ కోసం తీసుకువచ్చే కామారెడ్డిలోని పీఎంహెచ్ కాలనీకి చెందిన బోయిని యాదగిరిని ఏ-4గా, నర్సంపల్లికి చెందిన బక్కి ప్రవీణ్ కుమార్ ను ఏ-5గా చేర్చి కేసు నమోదు చేశారు. ఐదుగురిని విచారించగా, మరో 14 మంది ఈ కేసులో భాగస్వామ్యమై ఉన్నట్లు తేలిందని, వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు. చట్ట విరుద్ధంగా లింగ నిర్ధారణ చేసే వారి వివరాలను డయల్ 100కి లేదా పోలీస్ కంట్రోల్ నంబర్ 8712686133కి సమాచారం అందించాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ అన్నారు. కేసు దర్యాప్తులో చురుగ్గా వ్యవహరించిన సీసీఎస్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్, భిక్కనూర్ ఇన్ స్పెక్టర్ సంపత్ కుమార్, రాజంపేట ఎసై పుష్పరాజ్, సీసీఎస్ ఎసై ఉస్మాన్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



# ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు

- చైర్మన్ గా సర్పంచ్/స్పెషల్ ఆఫీసర్..
- మహిళా సంఘాల నుంచి ఇద్దరు సభ్యులు..
- కన్వీనర్ గా పంచాయతీ సెక్రటరీ
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



**జనపదం, హైదరాబాద్ సిటీ:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోన్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ముందడుగు పడింది. ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సర్కార్ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు పంచాయతీ, మున్సిపల్, వార్డు స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తూ శుక్రవారం జీవో జారీ చేసింది. గ్రామస్థాయిలో సర్పంచ్ లేదా ప్రత్యేక అధికారి, మున్సిపాలిటీ స్థాయిలో కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ చైర్మన్‌గా కమిటీలు ఏర్పాటు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. పంచాయతీ కార్యదర్శి లేదా వార్డు ఆఫీసర్ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ కన్వీనర్‌గా, ఇద్దరు డ్వాక్రా గ్రూపు సభ్యులు, మగ్గురు స్థానికులు కమిటీలో సభ్యులుగా ఉంటారని జీవోలో స్పష్టం చేసింది. కాగా ఈ కమిటీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ కొనసాగనుంది. నేడు ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. కమిటీల కోసం పేర్లు పంపించాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం ఆదేశించింది. 4లక్షల50వేలు ఇందిరమ్మ ఇండ్ల కోసం ఒక్కో ఇంటికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించనుంది. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన, సోషల్ ఆడిట్, అధికారులతో సంప్రదింపులు లాంటి కార్యక్రమాలు చేయనున్న ఈ ఇందిరమ్మ కమిటీల సభ్యుల పేర్లను ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు నామినేట్ చేస్తూ కలెక్టర్ కు సిఫార్సు చేయాలని ఇందిరమ్మ కమిటీ ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ ఆర్డర్స్ జారీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

# కూల్చేముందే మాట్లాడాలి..

- కాంగ్రెస్ హయాంలోనే మూసీ పరివాహకంలో నివాసాలు
- హైదరాబాద్ లోని డ్రైనేజీ వాటర్ మూసీలోనే కలుస్తోంది
- ప్రత్యామ్నాయం లేకుండా సుందరీకరణ ఎలా సాధ్యం..?
- ఆర్టికల్ 370 పునరుద్ధరణ ఆలోచన లేదు
- కశ్మీర్ లో 100 శాతం టార్గెట్ చేరుకున్నాం
- బీఆర్ఎస్ తో కలిసి పనిచేసే అవకాశమే లేదు..
- మీడియా చిట్ చాట్ లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**జనపదం, బ్యూరో :** కాంగ్రెస్ హయంలోనే మూసీ పరివాహక ప్రాంతాల్లో నిర్మాణాలు వెలిశాయని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మూసీ నది వెంబడి వెలసిన ఇళ్లను కూల్చడం అంత తేలికైన పనికాదని, దాదాపు 40 ఏళ్లుగా అక్కడ నివాసాలు చూస్తున్నామన్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ధనవంతులు ఎవరూ లేరని, అక్కడ పేదల ఇళ్ళను కూల్చే ముందు వారితో చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన సూచించారు. హైదరాబాద్ లో ఉన్న డ్రైనేజీ వాటర్ అంతా మూసీలోనే కలుస్తోందని, దానికి ప్రత్యామ్నాయం చూపించకుండా సుందరీకరణ చేస్తామంటే ఎట్లా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. సుమారు లక్షన్నర కోట్లతో మూసీనదిని సుందరీకరిస్తామని ప్రభుత్వం చెబుతోందని, అయితే అంత పెద్ద మొత్తంలో నిధులను ఎక్కడ నుంచి సేకరిస్తారని ప్రశ్నించారు.

**తొందరపాటొద్దు..**

పేదల ఇళ్లను కూల్చే విషయంలో హైడ్రా తొందరపాటు కూడదన్నారు. ఎక్కడిక్కడ సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తే, వారికి బ్యాంకు రుణాలను ఎవరు ఇస్తారని ప్రశ్నించారు. 40 ఏళ్లుగా మూసీ నదిని ఆనుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదలకు అన్ని సౌకర్యాలు కల్పించి ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హైడ్రా దుందుడుకుతో వ్యవహరిస్తే సక్సెస్ కాదని, దీని వెనుక సీఎం రేవంత్ రెడ్డికి వేరే ఉద్దేశ్యం ఉందని ఆరోపించారు. ఇంతకుముందున్న ప్రభుత్వాలు కూడా అక్రమ నిర్మాణాలను కూల్చివేశాయని, హైడ్రా అనేది సీఎం రేవంత్ రెడ్డి పెట్టుకున్న పేరని విమర్శించారు. మూసీలో ఉన్న పేదల నిర్మాణాలను కూల్చే ముందు ఆ మూసీనదిని



పూడ్చివేసి నిర్మించిన ఎంజీబీఎస్ బస్ స్టేషన్, మెట్రో పిల్లర్లను కూల్చాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్లు కూల్చమని బీజేపీ ఎంపీలు ఎవరూ రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పలేదని, తాను చెప్పేదే బీజేపీ పాలసీ అని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ తో కలిసి పనిచేయబోమని స్పష్టం చేశారు. ఈ విషయానికి సంబంధించి బీఆర్ఎస్ నేతలెవ్వరూ తమతో సంప్రదించలేదని, ఆ పార్టీతో కాంప్రమైజ్ కాబోమని ఆయన తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో చిట్ చాట్ గా కిషన్ రెడ్డి మాట్లాడారు.

**ఆరోపణల్లో నిజం లేదు..**

ఇటీవల కశ్మీర్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వందశాతం లక్ష్యానికి చేరుకుందని ఆయన చెప్పారు. హర్యానాలో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. హర్యానాలో ఈవీఎం ట్యాంపరింగ్ జరిగితే కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వచ్చిన జమ్మూలో ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల బీజేపీ ఇన్ చార్జ్ గా వ్యవహరించి తాను అన్ని అంశాలను స్పష్టంగా పరిశీలించానని చెప్పారు. జమ్మూలో ఒక రకంగా ఓటర్ల పోలరైజ్ జరిగిందని, కశ్మీర్ లో మరో రకంగా పోలరైజ్ జరిగిందని తెలిపారు. జమ్మూకశ్మీర్ లో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరగడం గమనార్హమని అన్నారు. హర్యానా ఎగ్జిట్ పోల్స్ రాగానే ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలు మంత్రిపదవుల కోసం రాహుల్, సోనియా గాంధీ వద్దకు క్యూ కట్టారని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆర్టికల్ 370ను పునరుద్ధణ చేసే ఆలోచన ఏమీలేదని ఆయన ఉద్ఘాటించారు. ఆర్టికల్ 370 పై మాట్లాడే ధైర్యం కాంగ్రెస్ కు లేదని ఆయన విమర్శించారు. జమ్మూకశ్మీర్ లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిస్తే, వారంతా ముస్లిం వర్గానికి చెందిన వారేనని అన్నారు. బీజేపీ నుంచి గెలిచిన 29 మంది హిందువులేనని, వారిలో కూడా 19 మంది కొత్తవారని ఆయన తెలిపారు. జమ్మూకశ్మీర్ భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం విధానంలో మార్పులేమీ లేవన్నారు. జమ్మూలో తీవ్రవాదంపై మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తామని కిషన్ రెడ్డి అన్నారు.

# సోమేష్ పై కేసు..

- జీఎస్టీ స్కామ్ పై ఈడీ నజర్..
- కేసీఆర్ ప్రభుత్వ చెల్లింపుల్లో రూ.46 కోట్ల అవకతవకలు
- మాజీ సీఎస్ తీరుపై తీవ్ర ఆరోపణలు..
- ప్రాథమిక విచారణలో ఏడుగురిపై కేసులు..



**జనపదం, హైదరాబాద్ సిటీ :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన జీఎస్టీ స్కామ్ పై ఈడీ కేసు నమోదు చేసింది. జీఎస్టీ చెల్లింపుల్లో రూ.46 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లుగా ఈడీ గుర్తించింది. లావాదేవీల్లో ఇన్ పుట్ ట్యాక్స్ క్రెడిట్, ఐజీఎస్టీ, సెస్ చెల్లింపునకు సంబంధించి అవకవతకలకు పాల్పడ్డారనే ఆరోపణలపై రాష్ట్ర మాజీ సీఎస్ సోమేష్ కుమార్ తో పాటు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు నిందితులుగా ఉన్నట్లు ఈడీ తేల్చింది. ఈ అక్రమ లావాదేవీల వ్యవహారంలో ఇప్పటికే హైదరాబాద్ సీసీఎస్ లో క్రిమినల్ కేసు నమోదైంది. సోమేష్ కుమార్ కనుసన్నల్లోనే స్కామ్ జరిగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. నాలుగేళ్ళ క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వంలో సోమేష్ కుమార్ రెవెన్యూ (వాణిజ్య పన్నులు) స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉన్నప్పుడు ఈ స్కామ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి పొందిన తర్వాత, ఆదాయాన్ని ఆర్జించే అన్ని శాఖలకు సోమేష్ కుమారే ఇన్ చార్జ్ గా కొనసాగడం గమనార్హం.

**బోగస్ ఇన్ వాయిస్ లతో...**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బోగస్ ఇన్వాయిస్‌లను సృష్టించి, పెద్ద ఎత్తున ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ను క్లెయిమ్ చేసినట్లు వాణిజ్య పన్నుల శాఖ ఆడిట్‌లో గుర్తించింది. ఈ కేసులో వస్తువులు సరఫరా చేయకపోయినా బోగస్ ఇన్వాయిస్ లను సృష్టించారని అధికారులు గుర్తించారు. 70 కంపెనీల ఐజీఎస్టీ చెల్లింపుల్లో భారీగా అవకతవకలకు పాల్పడడమే కాకుండా ఐజీఎస్టీ కింద రూ.1000 కోట్ల మేర అక్రమంగా ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ బదిలీ చేసినట్లు రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ ఆడిట్లో తేలింది. దీనిపై ఆ శాఖ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రాథమికగా విచారించిన సీసీఎస్ పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ ఎస్వీ కాశీ విశ్వేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ ఏ శివరామప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు, జీఎస్టీ సాఫ్ట్ వేర్ ను తయారు చేసిన ప్లింటో టెక్నాలజీని ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా చేర్చారు. కేసులో మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ ఏ5గా ఉన్నారు. ఇది వందల కోట్ల వ్యవహారం కాదని, మొత్తం స్కామ్ రూ.వేల కోట్లలో ఉంటుందని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చి సమగ్ర దర్యాప్తు కోసం సీఐడీకి అప్పగించింది.

# కారు, కమలం లోపాయికారి ఒప్పందం..

- సిసోడియాకు రాని బెయిల్ కవితకు ఎలా వచ్చింది..?
- ఎంఐఎంతో స్నేహపూర్వక ఒప్పందమే..
- కిషన్ రెడ్డి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం
- మూసీ ప్రక్షాళనకు రూ.1.50 లక్ష కోట్లు ఖర్చు చేస్తామని ఎక్కడా చెప్పలేదు
- మంత్రి సురేఖ నాగార్జున కుటుంబాన్ని ఉద్దేశ్యపూర్వకంగా వ్యాఖ్యానించలేదు
- బడా బాబులే లక్ష్యంగా హైడ్రా దూకుడు
- త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో మరిన్ని చేరికలు
- ఈ నెల 15 తర్వాత జిల్లాల పర్యటనలు
- మీడియాతో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చిట్ చాట్

**జనపదం, హైదరాబాద్ బ్యూరో:** ఢిల్లి లిక్కర్ స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటోన్న ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీస్ సిసోడియాకు రాని బెయిల్ అవే ఆరోపణలు ఎదుర్కొంటోన్న కేసీఆర్ తనయ కవితకు ఎలా వచ్చిందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీతో కలిసి తెరచాటు రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. శుక్రవారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఆరోపిస్తున్నట్లు ఎంఐఎం పార్టీకి కాంగ్రెస్ కు మధ్య ఎలాంటి పొత్తు లేదన్నారు. ఆ పార్టీతో తమకు ఉన్నది కేవలం స్నేహపూర్వక ఒప్పందం మాత్రమే అన్నారు. శాంతిభద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్న ఆయన తప్పు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**కఠిన చర్యలు..**

మజ్లిస్ తో సంబంధం వేరని, లా అండ్ ఆర్డర్ వేరన్న ఆయన తప్పు చేస్తే చట్టం ముందు అందరూ సమానమే అన్నారు. ఫిరోజ్ ఖాన్ వ్యవహారంలో లా అండ్ ఆర్డర్ ప్రకారం చర్యలు తీసుకోవాలని సీఎం ని కోరినట్లు తెలిపారు. తప్పు తమ పార్టీ శ్రేణులు చేసినా ఇతరులు చేసిన చట్టప్రకారం చర్యలు ఉంటాయని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ పార్టీ బీసీల విషయంలో స్పష్టమైన వైఖరితో ఉందన్నారు. ఈ విషయాన్ని తీన్మార్ మల్లన్న గుర్తించాలని కోరారు. మల్లన్న బీసీల పక్షాన మాట్లాడారనీ ఆయన వ్యాఖ్యలు పార్టీ లైన్ తప్పారని అనడానికి లేదన్నారు.

**త్వరలోనే చేరికలు..**

త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో మరిన్ని చేరికలు ఉంటాయని మహేశ్ కుమార్ అన్నారు. ఇప్పటికే కొంత మంది బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరిన వారు ఉన్నారన్నారు. కాంగ్రెస్ పై ప్రేమతో నే బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి వస్తున్నారన్నారు. తాము ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు సోషల్ మీడియాని మంచి పద్ధతి లో వాడుకున్నామన్న పీసీసీ చీఫ్ బీఆర్ఎస్ నేతలు అనైతికంగా డబ్బులు వెదజల్లి సోషల్ మీడియాతో తప్పులు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ స్వార్థ రాజకీయాలతో సోషల్ మీడియాను దిగజారి వాడుతున్నారని చెప్పారు. రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క బలమైన నాయకులు కాబట్టే సోషల్ మీడియాలో టార్గెట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. సినీ నటుడు నాగార్జున, ఆయన కుటుంబంపై రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలపై స్పందించిన ఆయన సురేఖ ఎవరిని కించపరిచే ఉద్దేశ్యంతో మాట్లాడలేదన్నారు. ఎంత కడుపు మంట ఉంటే ఆమె అలాంటి వ్యాఖ్యలు చేసి ఉంటారో గమనించాలన్నారు. కేటీఆర్ కొండా సురేఖను అవమానించేలా మాట్లాడారన్నారు. అందుకే ఆమె ఆ వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందన్నారు. కొండా సురేఖ వ్యక్తిగతంగా చేసిన వ్యాఖ్యలేవీ లేవన్నారు.

**నామినేటెడ్ కొంచెం ఆలస్యం నిజమే..**

దసరాలోపు నామినేటెడ్ పోస్టులు ప్రకటించాలని అనుకున్నా.. హర్యానా, జమ్మూకశ్మీర్ ఎన్నికలతో జాప్యం జరిగిందన్నారు. నెల రోజుల్లోగా కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్రమంత్రి హోదాలో ఉన్న కిషన్ రెడ్డి హైడ్రా విషయంలో బాధ్యత రహితంగా మాట్లాడడం సబబు కాదన్నారు. వాయినాడ్ అలాంటి పరిస్థితి మనకు రాకూడదనే మూసీ ప్రక్షాళనకు పూనుకున్నట్లు చెప్పారు. అనుకోని సంఘటన ఎదురైతే అందరూ ఇబ్బందులు పడాల్సి వస్తుందనే విషయాన్నిగ్రహించాలన్నారు. తమ ప్రభుత్వం మూసీ




ప్రక్షాళనకు డీపీఆర్ ఇవ్వలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు రూ. 1.50లక్ష కోట్లు ఖర్చు చేస్తామని ఎక్కడా చెప్పలేదన్నారు. అయినా అభూత కల్పనలు సృష్టిస్తూ విపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ.. ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. హైదరాబాద్ ను భవిష్యత్తు తరాలకు తీర్చిదిద్దాలా వద్దా..? అని బీఆర్ఎస్, బీజేపీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ లకు కెబినెట్ కు ఎలాంటి సంబంధం లేదన్నారు. హైడ్రా టార్గెట్ పేద ప్రజలు ఏమాత్రం కాదన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టిన బడా బాబులే లక్ష్యంగా హైడ్రా పని చేస్తుందన్నారు. బీజేపీ పేదల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. పేదలకు పేటెంట్ కాంగ్రెస్ పార్టీయే అన్నారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో మరిన్ని చేరికలు ఉంటాయన్నారు. పూర్తి స్థాయిలో జిల్లా పర్యటన తర్వాతే పీసీసీ కమిటీల నియామకం ఉంటుందన్నారు. దసరా తర్వాత ఈ నెల 15,16 తేదీల్లో రెండు జిల్లాల చొప్పున పర్యటిస్తానని చెప్పారు..

# సమగ్ర కులగణనకు అడుగులు..

- రాష్ట్ర ప్రణాళిక శాఖకు బాధ్యతలు
- ఇంటింటి కుటుంబ సర్వే 60 రోజుల్లో పూర్తి చేయాలి
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**జనపదం, హైదరాబాద్ బ్యూరో:** రాష్ట్రంలో సమగ్ర కులగణనపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సమగ్ర ఇంటింటి సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వే చేయనున్నట్లు ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పేర్కొన్నారు. సర్వే బాధ్యతలను ప్రణాళికశాఖకు అప్పగించారు. మొత్తం 60 రోజుల్లోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇదిలావుండగా రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ ను ప్రభుత్వం నియమించింది. హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ ను కమిషన్ చీఫ్ గా నియమించింది. ఉప కులాల వారీగా ఎస్సీల వెనుకబాటుతనాన్ని కమిషన్ అధ్యయనం చేసి, 60 రోజుల్లోగా నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుంది.



**24 గంటలోపే జీవో జారీ**

తెలంగాణ రాష్ట్రంలో తక్షణమే సమగ్ర కులగణన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు జీఓ నంబర్ 18 ను విడుదల చేసింది. సమగ్ర కులగణను ప్రణాళిక శాఖ (ప్లానింగ్ డిపార్టుమెంట్) ద్వారా 60 రోజుల్లో చేపట్టాలని జీవోలో స్పష్టంగా పేర్కొంది . కాగా కులగణన పై నిన్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుల అధ్యర్వం లోని బీసీ ప్రతినిధుల బృందం కలిసిన 24 గంటల్లోపే జీవో విడుదల కావడంపై బీసీ సామాజిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మరోసారి తెలంగాణకు గుండు సున్న

**(మొదటిపేజీ తరువాయి)** అన్యాయం జరిగేది కాదని, కేంద్రాన్ని నిలదీసే వారమన్నారు. గతంలో కూడా అనేక సార్లు కేంద్రంపై పోరాటం చేసి రాష్ట్రానికి నిధులు సాధించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా ఒక్క రూపాయి కూడా కేంద్రం తెలంగాణకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను తీసుకరావడంలో బీజేపీ, కాంగ్రెస్ ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు.

# వైషమ్యాలు తొలగిస్తాం..






**(మొదటిపేజీ తరువాయి)** ఏర్పాటు చేస్తుంటే ఎందుకు తప్పుపడుతున్నారంటూ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను ఉద్దేశించి చెప్పారు. ఏ దొరలు పేదలకు విద్య, వైద్యం దూరం చేశారో ఆ దొరల పక్కన చేరి బలహీన వర్గాలకు మంచి చేస్తే విమర్శిస్తున్నారని ప్రవీణ్ కుమార్ పై మండిపడ్డారు. కేసీఆర్ చెప్పినట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీల పిల్లలు గొర్రెలు, బర్రెలు కాసుకుని బతకాలా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ని 1023 రెసిడెన్షియల్ స్కూల్స్ లో కనీస మౌలిక వసతులు కల్పించలేదన్నారు.

**బడికి వసతి మరిచారు..**

33 జిల్లాల్లో ప్రభుత్వ స్థలాన్ని దిగమింగి కేసీఆర్ పార్టీ భవనాలు కట్టుకున్నారని ఆరోపించారు. పార్టీ కార్యాలయాల నిర్మాణానికి భూమి, నిధులు ఉన్నా పిల్లలకు బడికి మౌలిక వసతులు కల్పించాలన్న ఆలోచన కేసీఆర్ కు రాలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వేరుగా ఉంటే బీఆర్ఎస్ నేతల మనసుల్లో విషం నిండుతుందన్నారు. అందుకే కుల మతాలకు అతీతంగా కలిసి ఉండాలనే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని సీఎం చెప్పారు. ఎన్నికల ముందు నిరుద్యోగ సమస్య పరిష్కారంతో పాటు నాణ్యమైన విద్య, నిరుపేదలకు వైద్యం అందిస్తామని మాట ఇచ్చామన్న సీఎం రాష్ట్రంలో విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించే కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. రాష్ట్రంలో 5వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసిన గత ప్రభుత్వం పేద పిల్లలకు విద్యను దూరం చేసే ప్రయత్నం చేసిందన్నారు. అందుకే పేదలకు నాణ్యమైన విద్యను అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో విద్యా శాఖను సమూలంగా ప్రక్షాళన చేస్తామన్నారు. ఇందులో భాగంగా టీచర్ల ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ పూర్తి చేసి ప్రభుత్వంపై నమ్మకం కలిగించినట్లు వివరించారు. పదేళ్ల పాలనలో రూ. 22లక్షల కోట్ల బడ్జెట్, రూ. 7 లక్షల కోట్లు అప్పు చేసిన కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలలల్లో మౌలిక వసతులకు కనీసం రూ.10వేల కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు. తాము అధికారంలోకి రాగానే 90 రోజుల్లో 30 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామన్న సీఎం ఈ నెల 10న 11వేల మందికి ఉపాధ్యాయ నియామక పత్రాలు అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, రంగారెడ్డి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.







Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com